సాక్షి మెదక్

మంగళవారం ı 1 ı అక్టోబర్ ı 2024



మది నిండుగా.. పూల పండుగ

ఆడపడచులు ఎంతో ఆడంబరంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



దసరాలోపు నామినేటెడ్

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను దసరాలోపు భర్తీ చేయనున్నారు.

వివరాలు 8లో ▸

నేటి నుంచి పోలీస్‌యాక్ట్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో మంగళవారం నుంచి పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తారోకో, నిరసన, ర్యాలీ, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలాగే ప్రజాధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

పైరవీలకు తావు లేదు

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



అర్జీలను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా వచ్చి సంప్రదించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి చట్టప్రకారం ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందని అన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌడిపల్లిలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు జరుగుతున్నందున విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీడీ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

రామాయంపేట(మెదక్): బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా రూ. నాలుగు వేల జీవనభృతి చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేటలో నిర్వహించిన ప్రాంతీయ మహాసభలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ విషయంలో కొందరు రైతులకు అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు జెండాను ఆవిష్కరించి ఇటీవల మృతి చెందిన సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ రామాయంపేట ఏరియా కమిటీ కార్యదర్శిగా బాలమణిని ఎన్నుకున్నారు.

మేమెట్లా బతకాలి..



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న వడ్డెరలు

మెదక్ కలెక్టరేట్: మా తాతల కాలం నుంచి రాళ్ల కొట్టుకొని అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం ఫారెస్ట్ అధికారులు మమ్ములను రాళ్ల కొట్టొద్దని బెదిరిస్తున్నారు. ఈ వృత్తి తప్ప మరో వృత్తి తెలియని మేము ఎలా బతకాలంటూ కొల్చారం మండలం కేంద్రానికి చెందిన వడ్డెరలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



పరిశ్రమ ఎదుట గ్రామస్తుల ఆందోళన

మనోహరాబాద్(తూప్రాన్): ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమతో ప్రాణాలు పోతున్నాయని, చిన్నారులకు శ్వాసకోశ, చర్మవ్యాధులు వస్తున్నాయని, రాత్రి సమయంలో వచ్చే శబ్దాలతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని గ్రామస్తులు సోమవారం పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు.



కొత్త సార్లొస్తున్నారు

- డీఎస్సీ ఫలితాలు విడుదల
- ఈనెల 9న నియామక పత్రాల అందజేత
- జిల్లాలో 310 పోస్టుల ఖాళీలు
- నేటి నుంచి ధృవపత్రాల పరిశీలన

పాపన్నపేట(మెదక్): దసరా ధమాకాగా ప్రభుత్వం తీపి కబురు అందించింది. సోమవారం డీఎస్సీ ఫలితాలు విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 9వ తేదీన నియామకపత్రాలు అందజేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలో మొత్తం 310 ఉపాధ్యాయ ఖాళీలుండగా, 1: 3 చొప్పున అభ్యర్థులను నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవనున్నట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. మెదక్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్జీటీలకు, 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఇతర కేడర్ ఉపాధ్యాయ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. కాగా జిల్లాలో ఎస్జీటీ టాపర్‌గా చిలప్‌చెడ్ మండలం రహీంగూడకు చెందిన జూల లింగం (78.87), ఎస్‌ఏ సోషల్ టాపర్‌గా కౌడిపల్లికి చెందిన గొల్ల శ్రీకాంత్ (78.33) ర్యాంకు సాధించారు.

2017 తర్వాత మెగా డీఎస్సీ..

2017 తర్వాత ప్రభుత్వం మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక కీని ఆగస్టు 13న విడుదల చేశారు. ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. సెప్టెంబర్ 6న తుది కీ విడుదల చేశారు. చివరకు సోమవారం ఫలితాలు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 310 పోస్టులు ఉండగా, ఇందులో అత్యధికంగా ఎస్జీటీ 136 పోస్టులు ఉన్నాయి. లాంగ్వేజీ పండిత్ హిందీ 15, తెలుగు 13, ఉర్దూ 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ తెలుగు 1, ఎస్‌ఏ (బయో) 18, ఉర్దూ 1, ఎస్‌ఏ ఇంగ్లిష్ 11, హిందీ 4, గణితం 17, ఉర్దూ 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ తెలుగు 2, ఫిజికల్ సైన్స్ 7, ఉర్దూ 1, స్పెషల్ తెలుగు 9, ఎస్‌ఏ సోషల్ 24, ఉర్దూ 1, ఎస్‌ఏ తెలుగు 4, ఉర్దూ 1, ఎస్జీటీ స్పెషల్ తెలుగు 22, ఎస్జీటీ ఉర్దూ 20 పోస్టులు జిల్లాలో ఉన్నాయి.

ఎస్‌ఏ సోషల్ టాపర్‌గా శ్రీకాంత్



కౌడిపల్లి(నర్సాపూర్): రెండు నెలల్లో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు కౌడిపల్లి యువకుడు. గ్రామానికి చెందిన గొల్ల యాదయ్య, శోభ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్నకొడుకు శ్రీకాంత్‌యాదవ్ రెండు నెలల క్రితం గురుకుల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొంది రామాయంపేట గురుకుల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించాడు. 1 నుంచి 10వ తరగతి వరకు కౌడిపల్లిలోని చైతన్య స్కూల్‌లో, ఇంటర్మీడియెట్ మెదక్ గీతా జూనియర్ కాలేజ్‌లో చదివాడు. బీఈడీ ఓయూలో పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే రెండు జాబ్‌లు సాధించాడు.

ఎస్జీటీ విభాగంలో లింగం..



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎస్జీటీ జిల్లా టాపర్‌గా చిలప్‌చెడ్ మండలం రహీంగూడకు చెందిన జూల లింగం నిలిచాడు. లింగం పదో తరగతి వరకు మండలంలోని సోమక్కపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్ జోగిపేట స్వామి వివేకానంద కాలేజీలో చదువుకున్నాడు. అనంతరం డైట్ సంగారెడ్డిలోని నాగార్జున కాలేజీలో చదివి, సంగారెడ్డిలోనే డిగ్రీ పూర్తి చేశాడు. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీలో 78.87 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అర్జీలపై ప్రతీ వారం సమీక్ష

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణికి 87 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణికి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా భూ సమస్యలు ఉండగా, డబుల్‌బెడ్‌రూం, పెన్షన్లు, రుణమాఫీ వంటి వాటిపై ఎక్కువగా వచ్చాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన వినతులపై ప్రతీ వారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల పర్యటనలో గుర్తించిన సమస్య ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదు



పంట పెట్టుబడి కోసం బ్యాంకులో రూ. 20వేల రుణం తీసుకున్న. ఇప్పుడు అసలు, వడ్డీ కలిపి రూ. 70 వేలు అయిందని బ్యాంకు అధికారులు చెప్పారు. రుణమాఫీ కాకపోవడంతో నెల రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ఎందుకు కాలేదో చెప్తలేరు. రామాయంపేటకు బస్సు కిరాయి పెట్టుకొని తిరిగి తిరిగి అవస్థలు పడుతున్నా.

– రాజయ్య, తొనిగండ్ల, రామాయంపేట

ధరణితో భూమి పోయింది



అల్లాదుర్గం మండలం రెడ్డిపల్లిలో ఎకరా ఆరు గుంటల భూమి ఉండేది. ఈ భూమి ధరణి వచ్చాక కనిపించకుండా పోయింది. 2003లో పట్టాదార్ పాస్ పుస్తకం సరిచేసేందుకు దరఖాస్తు అందజేశా. ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదు. నా భూమి నాకు ఇప్పించగలరు.

– కిష్టయ్య, రెడ్డిపల్లి, అల్లాదుర్గం

బాలికలకు ఎంత కష్టం!



టాయిలెట్‌కు వెళ్లేందుకు వరుసలో ఉన్న బాలికలు

98 మందికి ఒకటే మరుగుదొడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): బడిలో అన్ని సౌకర్యాలు ఉంటేనే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా వినగలుగుతారు.. అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడతాయి. అయితే బడిలో కనీస సౌకర్యాల్లో ఒకటైన మరుగుదొడ్డి లేకపోతే? పిల్లలకు ఎంత ఇబ్బంది?.. ముఖ్యంగా బాలికలకైతే మరింత సమస్య.. మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో 98 మంది విద్యార్థినులకు ఒకటే టాయిలెట్ ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటర్‌వెల్‌లో వరుసలో నిలబడి నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నారు. అత్యవసరం అయితే ఇంటికి వెలుతున్నారు. కొందరు నీరు తాగితే టాయిలెట్ వస్తుందని తాగడమే మానేశారు. ఇక బాలురు అయితే ఆరు బయటకు వెళ్తున్నారు. పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులు ఉండగా, ఇందులో ఆరుగురు మహిళా టీచర్లు ఉన్నారు. వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈవిషయమై హెచ్‌ఎం సరోజను వివరణ కోరగా ఒకే టాయిలెట్‌తో సమస్య ఉందని, జిల్లా అధికారులకు సమస్యను వివరించామని పేర్కొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. రూ. రెండు లక్షలు విలువ చేసే మోటార్‌కు రూ. 4 లక్షలు ఎలా ఖర్చు చేస్తారని అధికారులను కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. వారం రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీరు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్పందించిన మున్సిపల్ డీఈఈ మహేష్ పంపుహౌస్ వద్ద నీటిని సరఫరా చేసే మోటార్ కాలిపోయినట్లు తెలిపారు. గత నెలలో రూ.50 వేలు పెట్టి మరమ్మతులు చేయించారు కదా? మళ్లీ ఈనెల మరో లక్ష రూపాయలు ఎందుకు ఖర్చు చేశారని మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ప్రశ్నించారు. బతుకమ్మ ఉత్సవాలకు పట్టణంలో విద్యుత్ దీపాల కోసం రూ. లక్షలు ఖర్చు చేసి ఎందుకు అద్దెకు తెస్తున్నారు. ఆ డబ్బులతో కొత్తవి కొనుగోలు చేయవచ్చు కదా అన్నారు. అంతకు ముందు మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు కౌన్సిలర్లు రెవెన్యూ సమస్యలు విన్నవించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ.. పట్టణానికి నీరందించే పంప్‌హౌస్ వద్ద జేసీబీలతో ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. సోమవారం పాపన్నపేటలోని ఎల్లుపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన హెచ్‌ఎం అశోక్‌రెడ్డి పదవీ విరమణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏడేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వేసి అనుకున్న సమయానికి ఫలితాలు విడుదల చేశామన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మహిళలకు పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పామన్నారు. బీఆర్‌ఎస్ రద్దు చేసిన స్కావెంజర్ వ్యవస్థను తిరిగి అమల్లోకి తీసుకువచ్చామన్నారు. మండలానికో ఎంఈఓను నియమించామని వివరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామ్య, కాంగ్రెస్ నాయకులు నిమ్మ రమేష్, మాన్‌కిషన్, జెడ్పీ మాజీ చైర్మన్ బాలయ్య, ఎంఈఓ నీలకంఠం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబరాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతో పలు గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. మహిళలు, చిన్నారులు వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను ఆలయాల వద్ద పెట్టి ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

నర్సాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతిసారి ఓటరు జాబితాను తాజాగా రూపొందిస్తారని చెప్పారు. టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీల గడువు వచ్చే ఏడాది మార్చి నాటికి ముగియనున్నందని తెలిపారు. అలాగే నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివ్వంపేట మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయన్నారు. నర్సాపూర్ మండలంలో 164 చెరువులు కుంటలు, శివ్వంపేట మండలంలో 162 చెరువులు, కుంటలు ఉన్నాయని వివరించారు. చెరువులు కుంటల సర్వే పూర్తయినందున వాటి మ్యాపులు తయారు చేస్తున్నట్లు వివరించారు.

పోలీసుల అదుపులో కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్‌ను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజేందర్ కథనం ప్రకారం.. కమిషనర్ జానకిరామ్ తన కుటుంబంతో కలిసి వారాసిగూడలో నివాసం ఉంటున్నారు. ఆయన మరో పెళ్లి చేసుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న భార్య కల్యాణి నిలదీసింది. దీంతో కక్ష పెంచుకున్న జానకిరామ్.. భార్య కల్యాణిని హతమార్చేందుకు కారులో తీసుకెళ్తుండగా.. అనుమానం వచ్చిన ఆమె వెంటనే డయల్ 100కు ఫోన్ చేసింది. తనను హతమార్చేందుకు కారులో తీసుకెళ్తున్నాడంటూ భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. హబ్సిగూడ వద్ద జానకిరామ్‌ను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. ఇదిలా ఉండగా జానకిరామ్ ఇప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్నట్లు కల్యాణి ఆరోపించింది.

అవన్నీ అసత్య ఆరోపణలు

తన భార్య చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్ అన్నారు. పలుమార్లు తనపై హత్యాయత్నం చేసిందని, డబ్బుల కోసం చాలా కాలంగా ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. భోజనంలో విషం పెట్టిందని, ఈ విషయం బహిర్గతం కావడంతో అప్పటి నుంచి వేధింపులకు గురిచేస్తోందని చెప్పారు. డబ్బులు వసూలు చేయడమే లక్ష్యంగా ఆమె ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆమెతో ఉండలేనని చెప్పడంతో తనపై కేసులు పెట్టినట్లు స్పష్టం చేశారు.

మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటా



దప్పు కొడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్): మాదిగలు, ఉపకులాలను గుండెల్లో పెట్టుకుంటానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు అల్లారం రత్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగ, ఉపకులాల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత కొన్నేళ్లుగా మాదిగలు రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నారని అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు మాదిగల రిజర్వేషన్లను ఆయా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించిందన్నారు. దీన్ని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం రత్నయ్యకు పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలని మెదక్ నియోజకవర్గ దళితులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులకు కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులు కళాశాలలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి కూడా తగిన చర్యలు తీసుకుంటామని, తాగునీటి సౌకర్యం కోసం ఆర్‌ఓ ప్లాంట్ నుఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

అమ్మో.. మేం పనిచేయలేం!

- పనులు చేయడానికి కాంట్రాక్టర్ల విముఖత
- ఏడాదిగా పెండింగ్‌లో బిల్లులు
- జిల్లాలో కుంటుపడుతున్న అభివృద్ధి

మెదక్‌జోన్: ఆన్‌లైన్ టెండర్ల ద్వారా రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఏడాదిగా బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేయాలంటేనే జంకుతున్నారు. ఏడాది కాలంగా రూ. 100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఇందులో పీఆర్ పరిధిలో రూ. 80 కోట్లు ఉండగా ఆర్‌అండ్‌బీశాఖ పరిధిలో రూ. 20 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఇటీవల నూతన రోడ్ల నిర్మాణాలతో పాటు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం మరో రూ. వంద కోట్లు మంజూరయ్యాయి. అయితే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. టెండర్లు పిలిచినా ససేమిరా అంటున్నారు. బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పాత బకాయిలు రూ. 30 కోట్లు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 493 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు వివిధ రకాల పనుల కోసం సమారు రూ. 30 కోట్లు వెచ్చించారు. అయితే వారి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. నాటి నుంచి బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేసిన పనులకు ఏళ్ల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడం, అభివృద్ధి కోసం నిధులు మంజూరైన పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పల్లెలు అభివృద్ధిలో వెనుకబడ్డాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి నిధులు విడుదల చేయిస్తే తప్ప జిల్లాలో అభివృద్ధి ముందుకు సాగేలా కనిపించడం లేదు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న బ్రిడ్జి పాతూరు పంచాయతీ పరిధిలోని కొచ్చెర్వు తండాలోనిది. ఆరునెలల క్రితం ఓ కాంట్రాక్టర్ రూ. 1.60 కోట్లు వెచ్చించి నిర్మించారు. దానికి సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు పైసా విడుదల కాలేదు. ఇలా జిల్లాలో పనులు పూర్తయిన వాటికి రూ. 100 కోట్ల మేర కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సి ఉంది.



క్లుప్తంగా

రాములుశర్మకు డాక్టరేట్‌



పట్టాలతో రాములుశర్మ

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన రిటైర్డ్‌ ఉపాధ్యాయుడు, గ్రామ పురోహితుడు దేశపతి మెట్టు రాములుశర్మకు గౌరవ డాక్టరేట్‌ వచ్చినట్లు సోమవారం ఆయన తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆసియా వేదిక్‌ ఇంటర్నేషనల్‌ కల్చర్‌ అండ్‌ రిసెర్చ్‌ స్ఫూర్తి అవార్డు ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు.

కుదిరిన పరస్పర సహకార ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్‌): ములుగు కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) హైదరాబాద్‌కు చెందిన అనురాగ్‌ విశ్వవిద్యాలయంలోని స్కూల్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ సైన్సెస్‌ల మధ్య సోమవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌.బి నీరజప్రభాకర్‌, అనురాగ్‌ సంస్థకు చెందిన అధికారులు డాక్టర్‌. అర్చన మంత్రి, డాక్టర్‌.నారాయణ, డాక్టర్‌.డీ ప్రతిభ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఉద్యాన పంటల్లో కృత్రిమ మేధ ఆధారిత, సెన్సార్‌ ఆధారిత సాంకేతిక ఇంటర్‌ డిసిప్లినరీ రీసెర్చ్‌ ప్రోగ్రామ్‌లపై ఇరువురి మధ్య సహకార పరిశోధన కార్యక్రమాలను నిర్వహించడం, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో సహకారాలు కలిగి ఉండటం ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్‌, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌, విజయ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించండి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి, ఎంపీ రఘునందన్‌ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌ కాలనీలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల భవనాలను కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా నిర్మించడం జరిగిందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యార్థుల కోసం ఆధునిక మౌళిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. అనంతరం మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు స్వయ రక్షణపై శిక్షణ అందించాలని సూచించారు. అదే విధంగా రామచంద్రాపురం డివిజన్‌లోని పలు సమస్యలను తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. పట్టణంలో త్వరలో పోస్ట్‌ కార్యాలయం ప్రారంభం కానుందని తెలిపారు. అదే విధంగా ఎంఎంటీఎస్‌ రైలు సర్వీస్‌లు పెంచే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్పనగేశ్‌, మెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, ఎంఈఓ పీపీ రాథోడ్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మది నిండుగా.. పూల పండుగ



రేపటి నుంచి బతుకమ్మ సంబురాలు

- పూల పండుగకు సిద్ధమైన మహిళలు
- ఎంగిలి పువ్వుతో ప్రారంభమై సద్దులతో ముగింపు

జగదేవ్‌పూర్‌: దేవుళ్లను పూలతో పూజిస్తే.. ఆ పూలను పూజించే సంస్కృతి తెలంగాణ ప్రత్యేకం. కేవలం మన రాష్ట్రానికే సొంతమైన ఇలాంటి వేడుక రానే వచ్చింది. తెలంగాణ ఆడపడచులు ఎంతో ఆడంబరంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. మన సాంస్కృతిక అస్తిత్వ పతాక.. బతుకమ్మ, పూల పండగ పరిమళాలతో ఊరూవాడా హోరెత్తనుంది. 2వ తేదీ ఎంగిలి బతుకమ్మతో ప్రారంభమయ్యే సంబురాలు 9 రోజులపాటు ఘనంగా జరిగి సద్దులతో ముగియనున్నాయి.

బతుకమ్మకు నైవేద్యాలు..

బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజులు తొమ్మిది రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. రోజుకొక్క తీరుతో గౌరమ్మను కొలుస్తారు.

ఎంగిలి పువ్వు బతుకమ్మ..

మొదటి రోజు మహాలయ అమావాస్య రోజు బతుకమ్మ వేడుక ప్రారంభమవుతుంది. దీన్ని పెత్తరామాస అని అంటారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

అటుకుల..

రెండోరోజు అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మగా కొలుస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

ముద్దపప్పు..

మూడో రోజు ముద్ద పప్పు బతుకమ్మ అని అంటారు. ముద్దపప్పు, బెల్లం, పాలుతో కలిపి నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

నానే బియ్యం...

నాలుగో రోజు నానే బియ్యం బతుకమ్మ అని అంటారు. నానేసిన బియ్యం పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

అట్ల..

ఐదో రోజు అట్ల బతుకమ్మ అంటారు. అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

అలిగిన...

ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటారు. ఈ రోజు అశ్వయుజ పంచమి, నైవేద్యమేమి సమర్పించరు. (ఆర్రెమి). ఆ రోజు బతుకమ్మలు పేర్చారు.

వేపకాయల..

ఏడో రోజు వేపకాయల బతుకమ్మ అంటారు. బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి నైవేద్యంగా పెడుతారు.

వెన్నముద్దల బతుకమ్మ..

ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ అంటారు. ఈ రోజు నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యంగా తయారు చేస్తారు.

సద్దుల బతుకమ్మ..

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. అశ్వయుజ అష్టమి నాడు అదే రోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదు రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. సాయంత్రం పాటలు పడుతూ ఆటలు ఆడుతారు. చెరువు వద్ద కూడా బతుకమ్మ ఆడి చెరువులోని నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత చక్కెర, రొట్టెతో చేసిన మలీద అనే వంటకాన్ని బంధువులకు పంచి తింటారు. ఆ తర్వాత ఖాళీ పళ్లెం (తాంబళం)తో పాటలు పడుతూ ఇంటికి చేరుతారు.

పెద్దల పేరిట బ్రాహ్మణులకు దానం



బ్రాహ్మణులకు బియ్యం, కాయగూరలు దానం చేస్తున్న ప్రజలు (ఫైల్‌)

దుబ్బాక : తెలంగాణ సంస్కృతిలో పెత్తర అమావాస్యకు చాలా ప్రత్యేకత ఉంది. గతించిన పెద్దల పేరిట బ్రాహ్మణులకు బియ్యం, పప్పులు, కాయగూరలు, పాలు, పెరుగు, ధనం, ధాన్యంను దానం చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారం. ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం పెత్తర అమావాస్యకు తమ తమ ఇళ్ల చేరుకొని తమ పెద్దల పేరిట బియ్యం ఇస్తుంటారు. బుధవారం ఉద యం నుంచి సాయంత్రం వరకు పెద్దలకు బి య్యం ఇవ్వాలని పురోహితులు చెబుతున్నారు.

పెత్తర అమావాస్య రోజే బతుకమ్మ

పెత్తర అమావాస్య నుంచే బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. ప్రతీయేటా పెత్తర అమావాస్య సందర్భంగా బతుకమ్మలను తప్పకుండా పేర్చడం తరాల నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా బుధవారం బతుకమ్మ పండుగ ప్రారంభం అవుతుంది.10 వ తేదీ వరకు బతుకమ్మ పండుగ జరుపుకోవాలని బ్రాహ్మణులు సూచించారు.

పితృదేవతల ఆత్మలకు శాంతి



పెత్తర అమావాస్య(మహాలయ అమావాస్య) రోజు గతించిన పెద్దల పేరిట బ్రాహ్మణులకు బియ్యం, ధనం, ధాన్యం దానం చేయడం వల్ల పితృదేవతల ఆత్మలు శాంతిస్తాయి. ఏడాదికి ఒకసారి వచ్చే పెత్తర అమావాస్యరోజు పితృకార్యాలు చేయడం, వారిని గుర్తు చేసుకుంటూ దానం చేయడం చాలా శ్రేష్టం. పెత్తర అమావాస్య రోజు వారి వంశవృక్షం పేరిట పితృకార్యాలు చేయడం వల్ల స్వర్గంలో ఉన్న పితృదేవతలు ఆనందం చెందుతారు.

– వేలేటి రామకృష్ణశర్మ, వేద పండితుడు

పెత్తర అమావాస్య గొప్పరోజు



పెత్తర అమావాస్య చాలా గొప్ప దినం. గతించిన పెద్దలను గుర్తు చేసుకుంటూ బ్రాహ్మణులకు కూరగాయలు, బియ్యం, ధాన్యం ఇస్తాం. ఉమ్మడి కుటుంబాల్లో చాలా ముఖ్యమైన రోజు. దూర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా పెత్తర అమావాస్యకు తప్పకుండా తమ ఇళ్లకు వచ్చిన పెద్దలకు బియ్యం ఇవ్వడం జరుగుతుంది. పెత్తర అమావాస్యను పెద్దల పండుగగా జరుపుకుంటారు.

– మల్లుగారి నర్సింహారెడ్డి

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట జిల్లా క్రీడాకారులు రాణించి, బంగారు పతకాలు సాధించారని జిల్లా యోగాసనా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు తోట అశోక్‌, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌ రెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. సింధూరి, మనీషా, ఫురేశ్‌, ఉమాదేవి, శ్రీప్రసన్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా జిల్లా యోగాసనా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షుడు అంజయ్య , చీఫ్‌ పాట్రన్‌ చిప్ప ప్రభాకర్‌, ఉపాధ్యక్షుడు విక్రం రెడ్డి, హరిప్రసాద్‌ తదితరులు విజేతలను, శిక్షకులను అభినందించారు.

డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పతకం



మెదక్‌ జోన్‌ : కార్తీక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్‌, కళాశాల సిబ్బంది

మెదక్‌జోన్‌ : యోగాసన పోటీల్లో మెదక్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బంగారు పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్‌ హుసేన్‌ తెలిపారు. 29న నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థి కుమ్మరి కార్తీక్‌ పాల్గొని బంగారు పతకంతోపాటు ఆర్టిస్టిక్‌ విభాగంలో వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కార్తీక్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే వచ్చే నెల కర్ణాటకలోని బెంగళూరు పట్టణంలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్‌ కాలేజీ ఇన్‌చార్జి గణపతి ఫిజికల్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వర్లు శరత్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో అధునాతన గన్స్‌



మిషన్‌ గన్స్‌ను పరిశీలిస్తున్న శ్రీకృష్ణ

- డీఆర్డీఓ, ఆర్మీ సహకారంతో తయారీ
- లోకేష్‌ మిషనరీ పరిశ్రమ ఎండీ శ్రీకృష్ణ

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఆర్మీ, డీఆర్డీఏ సహకారంతో ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి అధునాతన గన్స్‌ తయారు చేసి అందిస్తున్నామని లోకేష్‌ మిషనరీ పరిశ్రమం ఎండీ లోకేశ్వరరావు తెలిపారు. మనోహరాబాద్‌ మండలంలోని కాళ్లకల్‌ గ్రామ శివారులో టీఎస్‌ఐసీసీ పరిశ్రమల వాడలో గల లోకేష్‌ మిషనరీ పరిశ్రమలో ఆర్మీ, బీఎస్‌ఎఫ్‌, సీఆర్‌ఎఫ్‌ తదితర సంస్థల కోసం గన్స్‌ తయారీ కేంద్రంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్మీ వారి ఆర్డర్‌ మేరకు 550 మిషన్‌ గన్స్‌లు తయారు చేసి సోమవారం వారికి అందజేసినట్లు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ మేజర్‌ జనరల్‌ రాకేష్‌ మనోచ ఆధ్వర్యంలో గన్స్‌ను లారీలోకి డంప్‌ చేసి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు పరిశ్రమలో తయారు చేసిన వాటిని పరిశ్రమ వద్ద ప్రదర్శించారు.

గురువన్నపేటలో రెండో రోజు ఉద్రిక్తత

నిందితుడు ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేసిన పోలీసులు

- అడ్డుకున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): బాలికపై యువకుడు అత్యాచారం జరిపిన ఘటనలో మండలంలోని గురువన్నపేట గ్రామంలో రెండవ రోజు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.అఘాత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం బాధితురాలి బంధువులు, స్థానికులు నిందితుడి ఇంటిపై దాడి చేసి నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో పోలీసులు పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం కొందరిని విచారణకు తీసుకెళ్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. చిన్నారిపై లైగింక దాడి జరగడంతో ఆందోళన చేపట్టామని, బాధితులకు అండగా నిలిచిన వారిపై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. నిందితులకు సహకరిస్తూ తమకు అన్యాయం చేయడం ఏంటని ప్రశ్నించారు. వాహనాన్ని కదలనీయకపోవడంతో మరోమారు గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో మరోసారి ఎలాంటి ఘటన జరుగకుండా చూసుకుంటామని పోలీసులు చెప్పడంతో గొడవ సద్దు మణిగింది.

నిందితుడికి ఉరి శిక్ష విధించాలి : బీజేపీ నాయకులు

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని హన్మకొండ ఘటన మాదిరిగా ఉరి శిక్ష విధించాలని మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు,జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి డిమాండ్‌ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు సోమవారం బీజేపీ నాయకులు గ్రామాన్ని సందర్శించారు.



పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

అన్యమత ఉద్యోగులను తొలగించాలి

మెదక్‌ కలెక్టరేట్‌: దేవాదాయశాఖను రద్దు చేసి హిందూ ధార్మిక సంస్థల్లో అన్యమత ఉద్యోగస్తులను తొలగించాలని వీహెచ్‌పీ ఉమ్మడి జిల్లా సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం అన్నారు. సోమవారం విశ్వహిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయ ప్రాంగణాల్లో దుకాణాలను హిందువులకే కేటాయించాలని డిమాండ్‌ చేశారు. అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌, నాయకులు సత్యనారాయణ, నందారెడ్డి, కృష్ణమూర్తి, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలకు విద్యార్థులు



సిద్ధార్థ



శ్రీవాణి

గజ్వేల్‌రూరల్‌: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిధిలోని కొడకండ్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ హుస్నాబాద్‌లో అండర్‌–17 విభాగంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో తమ విద్యార్థులు సిద్ధార్థ, శ్రీవాణి ప్రతిభను చాటారన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఆకుల రజిత

- రాష్ట్ర స్థాయి హ్యాండ్‌ బాల్‌ పోటీలకు ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రజిత

హుస్నాబాద్‌: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ఆకుల రజిత అన్నారు. ఎస్‌జీఎఫ్‌ అండర్‌ –17 బాల బాలికల హ్యాండ్‌ బాల్‌ ఉమ్మడి మెదక్‌ జిల్లాకు సంబంధించి రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు సోమవారం హుస్నాబాద్‌ మినీ స్టేడియంలో నిర్వహించారు.ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది బాలురు, 100 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్‌ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సౌందర్య తెలిపారు. ఎంపికైన బాల బాలికలు అక్టోబర్‌ 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట్‌ జిల్లా కోస్గిలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఆమె వెల్లడించారు. పోటీలను ప్రారంభించిన రజిత మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్‌ పర్సన్‌ అయిలేని అనిత, సింగిల్‌ విండో చైర్మన్‌ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ఎస్‌జీఎఫ్‌ మండల కార్యదర్శి శ్రీనివాస్‌, కౌన్సిలర్‌ కొంకట నళినిదేవి, పీడీలు పాల్గొన్నారు.

దసరాలోపు నామినేటెడ్‌

- పదవుల భర్తీకి గ్రీన్‌ సిగ్నల్‌
- సీఎంతో చర్చించిన మంత్రులు దామోదర, కొండా సురేఖ



సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఉమ్మడి మెదక్‌ జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్‌ పదవులను దసరాలోపు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా మంత్రి దామోర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖలు సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఖాళీగా ఉన్న పదవులను దసరాలోపు భర్తీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చినట్లు తెలిసింది. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రస్థాయి నామినేటెడ్‌ పదవులను భర్తీ చేసింది. మార్కెట్‌ పాలకవర్గంతో పాటు, మరికొన్ని జిల్లా స్థాయి నామినేటెడ్‌ పదవులను కొన్నింటిని మాత్రమే భర్తీ చేసింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌, కేన్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ (సీడీసీ) చైర్మన్లు, దేవాలయాల పాలకమండళ్లు ఇతర నామినేటెడ్‌ పదవుల భర్తీ జరగలేదు. అధికారంలోకి రాగానే ఎంపీ ఎన్నికలు రావడం, ఇతర కారణాలతో ఈ పోస్టుల భర్తీ వాయిదా పడుతూ వస్తోంది. ఈ పోస్టుల కోసం జిల్లాలోని ఆ పార్టీ ముఖ్యనేతలు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని కొన్ని ముఖ్యమైన జిల్లా స్థాయి నామినేటెడ్‌ పోస్టులకు ఇప్పటికే దాదాపు ఖరారు కాగా, దీనిపై సీఎం ఆమోదముద్ర పడకపోవడంతో ఈ పోస్టులను అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహలు సోమవారం ఈ అంశంపై బేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సోమవారం ఈ ఇద్దరు మంత్రుల పర్యటన సంగారెడ్డిలో ఉంది. కానీ అనివార్య కారణాలతో ఈ పర్యటన రద్దయింది. ఇదే రోజు ఈ ఇద్దరు మంత్రులు సీఎంతో బేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు

నిందితులను శిక్షించాలని బీఆర్‌ఎస్‌ నాయకుల ఫిర్యాదు



కాలినపోయిన విగ్రహం, ముసుగు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): తెలంగాణ తల్లి విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల కిందట గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభం కాకపోవడంతో విగ్రహానికి ముసుగేసి ఉంచారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో ముసుగు పూర్తిగా కాలి బూడిద కాగా, విగ్రహం సల్పంగా కాలినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సోమవారం ఉదయం గ్రామస్తులు విగ్రహం ఎదుట ఆందోళన చేసి నిందితులను కఠినగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. బీఆర్‌ఎస్‌ మాజీ జెడ్పీటీసీ భీలు నాయక్‌, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గంగాధరి సుగుణ, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, గ్రామ శాఖ నాయకులు వెల్ది శోభరంగరావు, గంగాధరి రాజయ్య, గ్రామస్తులు ఎస్సై విజయ్‌భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు.

మంజీరాలో నీటమునిగి రైతు మృతి

హవేళిఘణాపూర్‌(మెదక్‌): మంజీరా పరివాహక ప్రాంతంలో నీట మునిగి రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్‌ మండల పరిధిలోని మగ్దూంపూర్‌ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గణేశ్‌, చిన్ననొల్ల బాల్‌రాజ్‌(42) ఆదివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. గణేశ్‌ పొలంకు సరఫరా చేసే నీటిలోని మోటార్‌ పని చేయకపోవడంతో అతడు చెప్పగానే బాల్‌రాజ్‌ నీటిలోకి దిగాడు. సింగూరు నుంచి వస్తున్న వరద ఉధృతంగా వస్తుండడంతో నీటమునిగి గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని గణేశ్‌ గ్రామస్తులకు తెలుపగా వారు వచ్చి గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం ఈతగాళ్లతో వెతకగా సాయంత్రం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య నర్సమ్మ ఉండగా, ఆమె ఫిర్యాదు మేరకు మెదక్‌ రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

కొల్చారం(నర్సాపూర్‌): విద్యుదాఘాతానికి వ్యక్తి మతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీరుడి రాములు(55) ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో విద్యుత్‌ బల్బు అమర్చుతుండగా కరెంట్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ ..

వెల్దుర్తి(తూప్రాన్‌) : రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి చెందిన ఘటన మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఏఎస్సై సదాత్‌ మియా కథనం మేరకు.. ఏపీలోని కర్నూల్‌ జిల్లాకు చెందిన కట్ల రమేశ్‌(35)కొద్దిరోజులుగా మండలంలోని మానెపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అందుగులపల్లిలో ఉన్న సైటు వద్దకు వెళ్లి తిరిగి బైక్‌పై మానెపల్లికి వెళ్తుండగా అందుగులపల్లి గ్రామ శివారులోకి రాగానే చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గోడ కూలీ వ్యక్తి

తూప్రాన్‌: ప్రమాదవశాత్తు ఇంటి గోడ కూలీ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మాల్కాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొంతం నర్సింలు(55) ఇంట్లో పైపులైను బిగిస్తున్న క్రమంలో గోడ కూలీ మీద పడింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు

గజ్వేల్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అక్కారం వద్దగల మిషన్‌ భగీరథ పంప్‌హౌజ్‌ వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్‌ మండలం మక్తమాసాన్‌పల్లికి చెందిన చింత వెంకటేశ్‌(26)కి ఇదే గ్రామానికి చెందిన శిరీషతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వెంకటేశ్‌ తొమ్మిదేళ్లుగా పంప్‌హౌజ్‌ వద్ద ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులకు వెళ్లి పంప్‌హౌజ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు.